# హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలి !

కరువు పీడిత రాయలసీమలో అత్యంత కరువు పీడిత ప్రాంతానికి చాలా కాలంగా ఆశాదీపంగా ఉంది హంద్రీ-నీవా ప్రాజెక్టు. ఒకటికి మూడుసార్లు పునాదిరాళ్లు వేసిన ఈ ప్రాజెక్టు నిర్మాణం ఎట్టకేలకు మొదలయిందని ప్రజలు సంతోషించాలో, లేక నీటి భరోసాగానీ కనీసం స్పష్టమైన మిగులు నీటి కేటాయింపుగాని లేని ఈ ప్రాజెక్టు తీర్చవలసిన కరువులో నాలుగోవంతయినా తీరుస్తుందా అని ఆందోళన చెందాలో తెలియని స్థితిలో ప్రజలున్నారు.

కర్నూలు, అనంతపురం జిల్లాల పడమటి ప్రాంతానికీ, అనంతపురం జిల్లా దక్షిణ భాగానికీ, చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతానికీ, కడప జిల్లాలో ఇప్పటికీ నీటితడి ఎరుగని తూర్పు భాగానికీ నీళ్లియ్యవలసి ఉంది హంద్రీ-నీవా. 40 టి.ఎం.సి.ల కేటాయింపులో 4 టి.ఎం.సి.లు తాగు నీటికి పోగా 36 టి.ఎం.సి.లతో నాలుగు జిల్లాలలో 6 లక్షల ఎకరాలకు సాగునీరియ్యాలని తొలినాటి ప్రతిపాదన. 36 టి.ఎం.సి.లతో 6 లక్షల ఎకరాలంటే ఆరుతడి పంట కంటే తక్కువ నీళ్లిస్తారని అర్థం. అయితేనేం, ఈ ప్రాజెక్టు కావలసిందేనని ప్రజలు చాలా కాలంగా పట్టుబడుతున్నారు.

**బహిరంగ సభ**

| | |
|---|---|
| సభాధ్యక్షులు | : **యు.జి. శ్రీనివాసులు**, జిల్లా కార్యదర్శి, మానవ హక్కుల వేదిక, ఆదోని. |
| స్థలం | : **మండల ప్రజాపరిషత్ హాల్**, B.S.N.L. టవర్ ఎదురుగా, పత్తికొండ. |
| సమయం | : **26 ఆగస్టు, 2007 తేది ఆదివారము ఉ॥ గం॥ 10-00 లకు** |
| వక్తలు | : **పి. రామచంద్రయ్య**, రాష్ట్ర నాయకులు, C.P.I. పార్టి, పత్తికొండ. |
| | **ఎ. వెంకటేశ్వర్లు**, A.P. రైతు సంఘం జిల్లా నాయకులు, C.P.M. పార్టి, పత్తికొండ. |
| | **డా॥ కె. బాలగోపాల్**, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మానవ హక్కుల వేదిక, హైదరాబాద్. |
| | **ఎ. చంద్రశేఖర్**, H.R.F. రాష్ట్ర నాయకులు, హంద్రీనీవా జలసాధన సమితి సభ్యులు, అనంతపురం. |

నీళ్లు తగు మాత్రం ఉండడం ఎంత ముఖ్యమో, ఆనీటి మీద హక్కు ఉండడం అంతే ముఖ్యం. కానీ హంద్రీ-నీవాతో సహా రాయలసీమ, తెలంగాణ జిల్లాలలో కృష్ణా నదిమీద చేపడుతున్న తొమ్మిది ప్రాజెక్టులకు నీటి హక్కు అడగబోమనీ, నీళ్లున్నప్పుడే పొలాలకు పారించుకుంటామనీ, మన రాష్ట్ర ప్రభుత్వం రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్‌కు హామీ యిచ్చివచ్చింది. ప్రతి సంవత్సరం కృష్ణానది నీళ్లు అపారంగా సముద్రం పాలవుతున్నాయని మీడియా ప్రచారం చేస్తుండడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆ హామీ యిచ్చిఎంత నష్టం చేసిందో ప్రజలు గ్రహించడం లేదు. సంవత్సరంలో కొద్దిరోజులు నదిలో వరద వచ్చి, పెద్దెత్తున నీళ్లు పరవళ్లు తొక్కుతూ సముద్రంలోకి పోతున్న అభిప్రాయం మీడియాదృశ్యాలు మనకు కలిగిస్తుండవచ్చును. కానీ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మిగులు జలాల ప్రాజెక్టులన్నీ కట్టేస్తే ఈ వరద వాటి అవసరాలకు ఎంత మాత్రం సరిపోదు. ఎప్పుడో ఒకసారి తప్ప ఈ ప్రాజెక్టులు హామీ యిచ్చిన నీటి పారకాన్ని రైతులకీయవు. నాలుగింట మూడు సంవత్సరాలు రైతులు వట్టి కాలవలను చూస్తూ కాలం గడపవలసి ఉంటుంది.

రాయలసీమ, తెలంగాణ జిల్లాల కరువు ప్రాంతాలకు ఎక్కడికక్కడ విడివిడిగా హామీలిస్తూ సంతృప్తి పరచడం మన పాలకులు నేర్చుకున్నారు. ప్రజలకు తమ గురించే తప్ప ఇతరుల గురించి అవగాహన లేక పోవడం వల్ల ఈ మాయలోపడుతున్నారు. కానీ నిజానికి ఇవన్నీ కరువు ప్రాంతాలే కాబట్టి అన్నిటి అవసరాలు తీర్చవలసిందే. సమభావంతో తీర్చవలసిందే. అధికారబలం ఉన్న నాయకులు తమ ప్రాంతానికి నీళ్లిచ్చే ప్రాజెక్టుకు ప్రత్యేక హక్కులు కల్పించాలని చూడడం సమన్యాయంకాదు,సమంజసం కాదు. వెనుకబడిన ప్రాంతాలను ఒకే తాటిమీద ముందుకు నడిపించినప్పుడే సమన్యాయమూ జరుగుతుంది, ప్రజలమధ్య సామరస్యమూ నెలకొంటుంది.

(P.T.O.)

కృష్ణానది జలాలపైన ఆధారపడి నిర్మిస్తున్న మిగులు జలాల ప్రాజెక్టులన్నిటినీ కలిపి లెక్కించినట్టయితే 300 నుండి 350 టి.ఎం.సి.ల నీరు అవసరమవుతుంది. అది కూడ చాలదని ప్రజలు ఆయా ప్రాంతాలలో భావిస్తున్నారు. నాలుగు జిల్లాలలోని తీవ్ర దుర్భిక్షప్రాంతాలకు నీళ్లియ్యవలసిన హంద్రీ-నీవాకు 40 టి.యం.సిలు చాలవనీ 100 టి.ఎం.సి.లు కావాలనీ డిమాండ్ ముందుకొచ్చింది. అటు తెలంగాణలో కృష్ణా నది బేసిన్ ఉండి కూడ అనది నుండి ఒక చుక్కనీరు పొందని రంగారెడ్డి జిల్లాలకు నీళ్లివ్వాలన్న డిమాండ్ ముందుకొస్తున్నది. ఇవన్నీ లెక్కలోకి తీసుకున్నట్టయితే 'వేల క్యూసెక్కులు వృధాగా సముద్రంలోకి పోతున్నాయంటూ' ఎన్ని ప్రాజెక్టులయినా కట్టుకోవచ్చునన్న అభిప్రాయం కలిగిస్తున్న మీడియా వ్యాఖ్యలు, తెలిసీ తెలియని రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు, అర్థరహితమైనవని గ్రహిస్తాం. అప్పుడు ఇన్ని ప్రాజెక్టులకూ నీళ్లెక్కడి నుండి ఇవ్వాలన్న ప్రశ్న వస్తుంది.

వర్షపాతం తక్కువ ఉన్న ప్రాంతాలకు నదీ జలాలు ఎక్కువ ఇవ్వాలి. వర్షపాతం ఎక్కువ ఉన్న ప్రాంతాలకు తక్కువ ఇవ్వాలి, అన్న ప్రాథమిక సమానతా సూత్రానికి విరుద్ధంగా మన రాష్ట్రంలో వర్షపాతం ఎక్కువ ఉన్న కోస్తా ప్రాంతానికే నదీ జలాలు ఎక్కువ ఇవ్వడం జరుగుతున్నది. అతి తక్కువ వర్షపాతం ఉన్న రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాలకు నీటి హక్కే లేకుండ ఎప్పుడుంటే అప్పుడే ఇస్తాం అనే ప్రాతిపదికమీద తొమ్మిది మిగులు జలాల ప్రాజెక్టులు ఇప్పుడు కడుతున్నది రాష్ట్ర ప్రభుత్వం. బాగున్నవాళ్లకు 75 శాతం భరోసాతో ప్రాజెక్టులు, దౌర్భాగ్యులకు ఏ భరోసా లేని 'లక్కీ డ్రా' ప్రాజెక్టులు కట్టడం ఏం న్యాయం?

అందుకే కృష్ణానదీ జలాల పునఃపంపిణీ జరగాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాం. నాగార్జున సాగర్ ఎగువన నదిలో చేరే నీరంతా ఎగువ ప్రాంతపు కరువు జిల్లాలకే కేటాయించినట్టయితే కృష్ణా డెల్టాకు పోతున్న 80 టి.ఎం.సి.ల నికరజలం రాయలసీమ, తెలంగాణ జిల్లాలో కడుతున్న కొత్త ప్రాజెక్టులకు దక్కుతుంది. కృష్ణాడెల్టా, నాగార్జునసాగర్ తదితర పాత ప్రాజెక్టుల నీటిభరోసాను 75 నుండి 60 శాతానికి తగ్గిస్తే అదే భరోసాతో ఇంకొక 200 టి.ఎం.సిలపైన కూడ నీటి హక్కు లభిస్తుంది. గోదావరి నుండి నీళ్లు తరలించే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నదిగానీ అది ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రయోజనాలకు దెబ్బతీస్తుందని ఆ ప్రజల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు ద్వారా భారీగా గోదావరి జలాలను కోస్తా జిల్లాలకు తరలిస్తున్నారు కాబట్టి వారి ఆందోళన సహేతుకమైనదే.

అసలు ప్రభుత్వానికి వ్యవసాయదారుల సంక్షేమం పట్టిందా, లేక రైతుల పేరుమీద కడుతున్న ప్రాజెక్టులన్నీ ప్రత్యేక ఆర్థిక మండలాలకూ, పరిశ్రమలకు నీళ్లివ్వడానికా అన్న సందేహమూ వస్తున్నది. పోలవరం ఎడమ కాలువ నీళ్లు సాగునీటికీ కాదు, త్రాగునీటికీ కాదు. కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి నుండి ఎస్.కోటలో జిందాల్ వారి బాక్సైట్ రిఫైనరీ దాకా కార్పోరేట్ కంపెనీల అవసరాలకోసం అనేది స్పష్టంగా ఉంది. గండికోట రిజర్వాయర్ కోసం అని పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని ఏకపక్ష నిర్ణయం ద్వారా పెంచింది కడపజిల్లా రైతుల ప్రయోజనాల కోసం సహితంకాదు, బ్రాహ్మణీ స్టీల్స్‌కు, పులివెందల యురేనియం ప్రాజెక్టుకు నీళ్లివ్వడానికి అన్న విషయమూ స్పష్టం అవుతున్నది. తాగునీటికీ సాగునీటికీ ఇచ్చిన తరువాతే వేరే అవసరాలకు నీళ్లివ్వాలన్న న్యాయబద్ధమైన సూత్రాన్ని ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా పక్కన పెట్టింది.

హంద్రీ-నీవా ప్రాజెక్టును సమగ్రంగా నిర్మించి నాలుగు జిల్లాలలో 6 లక్షల ఎకరాలకు తగు మాత్రం నీళ్లివ్వాలనీ, తొలి ప్రతిపాదన ప్రకారం తాగునీరు ఇవ్వాలనీ, కరువు ప్రాంతాలన్నిటి నీటి అవసరాలనూ సమభావంతో తీర్చాలనీ డిమాండ్ చేస్తూ జరిపే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**మానవ హక్కుల వేదిక,**

**(H.R.F)**

కర్నూలు జిల్లా శాఖ.

ఆదోని,

ప్రచురణ తేది : 21-08-2007.

శ్రీ బాలాజి ప్రింటింగ్ ప్రెస్, ఆదోని. సెల్ : 9885325330